క్లుప్తంగా

వైభవంగా స్వామి అమ్మవార్లకు పల్లకి సేవ



ప్రత్యేక అలంకరణలో స్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సందర్భంగా స్వామి అమ్మవార్ల పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా రావణసేవ



రావణ వాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

మనుబోలు: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి రావణ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు సాయిశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి రావణవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం వెంట డీజే, తప్పెట్లు, కేరళ బ్యాండ్ మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీతాకోక చిలుకల వేషధారణలో కేరళ యువతుల ప్రదర్శన ప్రత్యేకత. ఉత్సవానికి ఉభయకర్తలుగా బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, జానికి దంపతులు వ్యవహరించారు.

నేత్రపర్వంగా జానకీరామ స్వామి కల్యాణోత్సవం



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం మజరా రామ్‌నగర్‌లో కొలువైన జానకీరామ స్వామి కల్యాణోత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపారు. ఉభయకర్తలుగా బొద్దుకూరు సుధాకర్, కామాక్షి దంపతులు వ్యవహరించారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తగా దుగ్గా శంకర్‌రెడ్డి వ్యవహరించారు. స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవాన్ని సాయంత్రం నిర్వహించారు.

పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గుండెనొప్పితో నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు నాటారు బాలకృష్ణను మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు. మెరుగైన చికిత్సను అందించాలని కోరారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ చలపతిరావు, నేతలు బాలశంకర్‌రెడ్డి, అల్లాబక్షు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గీతాంజలి'లో జాతీయ సదస్సు



కోవూరు: గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ ఇన్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అనే అంశంపై జాతీయ సదస్సును ట్రిపుల్ ఈ విభాగ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 81 మంది విద్యార్థులు, పరిశోధకులు, అకడమిక్ ఫ్యాకల్టీ తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కనులపండువగా సీతారాముల రథోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముల రథోత్సవాన్ని కనుల పండువగా శనివారం జరిపారు. కొబ్బరికాయలను భక్తులు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నరేష్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

పొదలకూరు: పట్టణంలోని శ్రీరామ మందిరంలో శనివారం రాత్రి భక్తజన సందోహం మధ్య సీతారాముల కల్యాణం వేదమంత్రోచ్చరణల మధ్య సాగింది. ఉభయకర్తలుగా కోనం బ్రహ్మయ్య, వూకోటి వెంకటేశ్వర్లు, వూకోటి లక్ష్మీనారాయణ దంపతులు వ్యవహరించారు. ముత్యాల తలంబ్రాలతో కల్యాణాన్ని నిర్వహించారు. రామమందిరం, తొగటివీధి, యాదవ వీధి, పద్మావతినగర్, వినాయకమాన్యం కాలనీ మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉభయకర్తలు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.



సింహ వాహనంపై కోదండరాముడు

ముత్తుకూరు: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కృష్ణపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం రాత్రి సింహవాహనంపై సీతారాముల గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై సీతారాముల విగ్రహాలు ఉంచి ప్రధాన వీధుల్లో ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, బాణసంచా వేడుకల మధ్య గ్రామోత్సవం జరిగింది.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని ఎస్‌పీబీవీడీ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపు విద్యార్థి జీ ప్రహ్లాద్‌కుమార్ 988 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు 400 మార్కులకు పైగా సాధించారు. కళాశాల చైర్మన్ బి.వెంకటేశ్వర్లు, ఎండీ తూపిలి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ కొండాపురం కోటేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌వీబీవీడీ కాలేజీ యాజమాన్యం



విజ్ఞాన్ విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

విజ్ఞాన్ కాలేజీ విద్యార్థులు

పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియేట్ ఫలితాల్లో ప్రతిభను చూపారు. ఫస్టియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో దేవల్ల నిత్యకృతిక 465 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. షేక్ తస్లీమా, వి.హేమంత్ 464 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. జీ సాయికీర్తి 460 మార్కులతో తృతీయ స్థానంలో ఉన్నారు. కే హర్షవర్ధన్ 459 మార్కులతో నాల్గో స్థానం కైవసం చేసుకున్నాడు. జూనియర్ సీఈసీ గ్రూపులో అచ్చి నందిని 453 మార్కులు సాధించి మండలం ప్రథం స్థానం, రాపూరు రమ్య 441 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 981 మార్కులతో కార్తీక్, 980 మార్కులతో షేక్ సమీర్, 975 మార్కులతో టీవీ కార్తీక్ మండలంలో ద్వితీయ, తృతీయ, చతుర్ధ స్థానాల్లో నిలిచారు. కాలేజీ యామాన్యం సుధాకర్‌రెడ్డి, సుబ్బారావు, జీఎస్ రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు.

వెంకటాచలంలో 57.7 శాతం ఉత్తీర్ణత

వెంకటాచలం: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 57.7 శాతం ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 71 మందికి 41 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 105 మందికి కేవలం 24 మంది (23 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

- ఇంటర్‌లో 981 మార్కులు



తండ్రితో విద్యార్థి కార్తీక్

పొదలకూరు : ప్రతిభకు, ఉన్నత చదువులు చదివేందుకు పేరికం అడ్డురాదని నిరూపించాడు పొదలకూరుకు చెందిన ఎస్.కార్తీక్. తల్లి ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుండగా తండ్రి గ్రాఫిక్స్ అండ్ ప్రింటర్స్‌లో పనిచేస్తున్నాడు. కార్తీక్ స్థానిక విజ్ఞాన్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఎంపీసీలో 1000 మార్కులకు 981 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం కార్తీక్‌ను ఘనంగా సన్మానించారు.

గురుకులంలో నూరు శాతం ఉత్తీర్ణత



జే స్పనిత



జీ చరిష్మా



సీహెచ్ గాయత్రి



టీ హాసిని

ముత్తుకూరు: ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల ఇంటర్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 73 మంది పరీక్షలు రాయగా, ఫలితాల్లో 73 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఎంపీసీలో జీ చరిష్మా 977, నాగలక్ష్మి 971 మార్కులు సాధించారు. బైపీసీలో స్పనిత 967, జీ హారిక 956 మార్కులు సాధించారు. 29 మంది విద్యార్థులు 900 మార్కులకు పైగా సాధించారు. ఇక జూనియర్ ఇంటర్‌లో 78 మంది పరీక్షలు రాయగా, ఇందులో 78 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఎంపీసీలో సీహెచ్ గాయత్రి 466, వర్షిణి 457, శ్రీజ 457 మార్కులు సాధించారు. బైపీసీలో హాసిని 436, నిరూప 430 మార్కులు సాధించారు. 66 మందికిపైగా విద్యార్థులు 400పైగా మార్కులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో 82 శాతం ఉత్తీర్ణత

- సెకండియర్ 92 శాతం,
- ఫస్టియర్ 72 శాతం ఉత్తీర్ణత



జాహ్నవి



వెంకట విఘ్నేష్



సాయి మస్తాన్

మనుబోలు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలో 82 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం 63 మంది విద్యార్థులకు 58 మంది (92 శాతం) ఉత్తీర్ణత సాధించగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 81 మంది విద్యార్థులకు 59 మంది (72 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆర్.జాహ్నవి 889 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానం సాధించారు. ఎంపీసీ విద్యార్థి వెంకట విగ్నేష్ 865 మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు. సీఈసీ విద్యార్థి సాయిమస్తాన్ 758 మార్కులతో మూడో స్థానంలో నిలిచాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కావ్య 380, బైపీసీ విద్యార్థి అక్షయ్ 348 మార్కులు సాధించారు.

వాటర్ బేస్ ఘటనపై విచారణ జరపాలి



వాటర్ బేస్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

తోటపల్లిగూడూరు: మండలంలోని అనంతవరంలో ఉన్న వాటర్ బేస్ రొయ్యల ప్రాసెస్ యూనిట్లో అమ్మోనియా లీకేజీపై సమగ్ర విచారణ నిర్వహించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. శనివారం వాటర్ బేస్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రమాదానికి గురైన కార్మికులకు మూడు నెలల జీతం అదనంగా అందజేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు కందిపాటి రమణమ్మ, దారా సుబ్బయ్య, నాశిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆరా

వాటర్ బేస్ ఘటనపై కంపెనీ ప్రతినిధులతో టీడీపీ నాయకులు మాట్లాడి ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, విజయ డెయిరీ డైరెక్టర్ కోడూరు చినబాబిరెడ్డి, నెల్లిపూడి సుధాకర్, మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ (కొడవలూరు): మండలంలోని గండవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో జిల్లా స్థాయి రగ్బీ పురుషుల జట్టును శనివారం ఎంపిక చేశారు. అనంతపురంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు ప్రాతినిధ్యం వహించనుందని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. రగ్బీ జిల్లా కోచ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రకు పటిష్ట భద్రత

నెల్లూరు(క్రైమ్): నగరంలో ఆదివారం నిర్వహించనున్న హనుమభక్త శోభాయాత్రకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. యాత్ర జరగనున్న ప్రాంతాలను పోలీస్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఏఎస్పీ సౌజన్య, నగర, ఎస్పీ డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామారావు, రోశయ్య, వెంకటరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు నేడు

నగరంలో హనుమభక్త శోభాయాత్ర నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి అమల్లో ఉంటాయని నగర డీఎస్పీ సింధుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్పగుడి వైపు నుంచి నగరంలోకి వచ్చే వాహనాలను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం నుంచి పొదలకూరు రోడ్డుకు దారి మళ్లించామని వివరించారు. యాత్ర ముగిసేంత వరకు ఇది అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న దామోదర్

వధూవరులకు ఆశీర్వాదం

కోవూరు (కొడవలూరు): కొడవలూరు మండలం గౌతమినగర్ మాజీ సర్పంచ్ నాగిరెడ్డి రమేష్ అన్న నాగిరెడ్డి రఘు, రాధమ్మ కుమారుడు ప్రశాంత్‌కుమార్, శిరీష వివాహాన్ని నార్తురాజుపాళెంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, కొడవలూరు మండల ఎంపీపీ గాలి జ్యోతి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరి, కొండా శ్రీనివాసులురెడ్డి, మారంరెడ్డి రంగారెడ్డి, గాలి సునీల్, దేవిరెడ్డి సాయిరెడ్డి, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్తా

కోవూరు: ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. 320 మంది పరీక్షలకు హాజరుకాగా, 259 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ సికిందర్ తెలిపారు. బైపీసీలో సమీరా 972, ఎంపీసీలో రహమతున్నీసా 933, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో రమణమ్మ 434 మార్కులు సాధించారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో రైజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైజ్ ట్రస్ట్ డైరెక్టర్ దివ్య, నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చలపతి, పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ విద్యామందిర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

ముత్తుకూరు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో భాగంగా ముత్తుకూరులోని అదానీ విద్యామందిర్ (జూనియర్ కళాశాల) విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 22 మంది విద్యార్థులు జూనియర్ ఇంటర్ పరీక్షలు రాయగా 22 మంది ఉత్తీర్ణులైనట్టు విద్యా డైరెక్టర్ జార్జ్ థామస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఐ నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును రాష్ట్రంలో అమలు చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నగర సహాయ కార్యదర్శి సిరాజ్ డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసనను సీపీఐ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. నేతలు షానవాజ్, రమణయ్య, రామరాజు, సర్దార్, గౌస్, జియా, షబ్బీర్, అబ్దుల్ అజీజ్, ముక్తియార్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



కోవూరు(కొడవలూరు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అనుబంధ సంఘాల కమిటీ సభ్యులుగా నియమితులైన పలువురు మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం కలిశారు.

ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నీ ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో జిల్లా క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఏపీ ట్రాన్స్‌కో విశ్రాంత సూపరింటెండెంట్ ఇంజినీర్ శేషారెడ్డి, క్లబ్ సెక్రటరీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి హాజరయ్యారు. క్లబ్ వైస్ ప్రెసిడెంట్ వీరేపల్లి అశోక్‌కుమార్, కోశాధికారి శ్రీహరిరెడ్డి, క్యారమ్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమన్నారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.



వడ్డీ వ్యాపారంగా మారిన విద్యా వ్యవస్థ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను వడ్డీ వ్యాపారంగా మార్చారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశలను కార్పొరేట్ విద్యాసంస్థలు బలహీనతగా మార్చుకొని అడ్డగోలుగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ పరిణామాలతో తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపోయి మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డగోలుగా ఫీజుల వసూలును గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియంత్రించిన అంశాన్ని గుర్తుచేశారు. సదరు జీఓను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఫైనాన్స్ కంపెనీలతో కుమ్మక్కై సులభ వాయిదాల్లో ఫీజును చెల్లించొచ్చని చెప్తున్నాయని, దీనిపై 2.5 నుంచి మూడు శాతం వరకు వడ్డీని వసూలు చేసే దిగజారుడు సంస్కృతికి వెళ్లాయని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థ ఫీజుల వ్యవహారంలో ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రోత్సహించడం బాధాకరమన్నారు.



మాట్లాడుతున్న ఆశ్రిత్‌రెడ్డి

ఫీవర్ సర్వే పరిశీలన

నెల్లూరు(అర్బన్): వేదాయపాళెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని సప్తగిరి వీధిలో డెంగీ కేసు నమోదైన నేపథ్యంలో ఆ ప్రాంతంలో చేపట్టిన ఫీవర్ సర్వే, ఇండోర్ స్ప్రే పనులను జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ శనివారం తనిఖీ చేశారు. ఆయా వీధుల్లోని డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. డెంగీ కేసు నమోదైన ఇంటి ఆవరణాన్ని పర్యవేక్షించిన అనంతరం ఆమె మాట్లాడారు. మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్‌ను వదలాలని సూచించారు.

